RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 07 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ గురువారం 09-04-2026 పేజీలు: 8, వెల : 2.00

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న తెలంగాణ వాణి తెలుగు దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు

జిల్లా వారిగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారిగా ఆర్‌సి ఇన్చార్జులు, మండలాల వారిగా విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది

9441558369
9703247143
9493658107



ఇరాన్‌తో యుద్ధానికి పక్షం

## విరామం

**15 రోజుల సీజ్‌ఫైర్ ప్రకటించిన ట్రంప్**
**హర్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్**

వాషింగ్టన్, ఏప్రిల్8 :గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ -అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది.

2వ పేజీలో...



కోల్‌కతా, ఏప్రిల్8 : పశ్చిమబెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీపుర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు ఖాళీఘాట్‌లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



భవానీపూర్ లో మమత

## నామినేషన్

**భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు**
**నా జీవితం ఇక్కడే ప్రారంభం అయ్యిందని వెల్లడి**



తృణమూల్ కాంగ్రెస్‌కు

గట్టి వార్నింగ్ ఇచ్చిన

## కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ఇవాళ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా, నిర్భయంగా జరుగుతాయని పేర్కొన్నది. ఈసీ ఇవాళ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ పోస్టు చేసింది. హింస లేకుండా, బెదిరింపులు లేకుండా, తనిఖీలు లేకుండా, పోలింగ్ బూత్‌ల్లో జామ్ లేకుండా ఎన్నికల నిర్వహణ జరగనున్నట్లు ఈసీ పేర్కొన్నది. ఇక ఆ రాష్ట్రానికి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కూడా ఈసీ గట్టి వార్నింగ్ ఇచ్చింది. టీఎంసీకి సూటిగా హెచ్చరిక చేస్తున్నట్లు తన ట్వీట్‌లో ఈసీ చెప్పింది. కచ్చితంగా ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు నిర్భయంగా, స్వేచ్ఛగా జరుగుతాయని పేర్కొన్నది. అయితే ఇవాళ ఉదయం సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తృణమూల్ నేతలు కలిశారు.

2వ పేజీలో...



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై

## ఉత్కంఠ

**- విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం**
**- తీర్పును 22కు వాయిదా వేసిన హైకోర్టు**

హైదరాబాద్, ఏప్రిల్8 : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పునుఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది.

2వ పేజీలో...



ఎక్కడ ఎన్నికలు జరిగినా

## తెలంగాణయే ఏటీఎం

**- ఢిల్లీకి గులంగిరీ చేస్తోన్న రేవంత్ ప్రభుత్వం**
**- కొత్త పార్టీతో సామాన్యులకు అండగా నిలుస్తాం**
**- కాంగ్రెస్ అవినీతిపై ఇక నిరంతరంగా నిలదీస్తాం**
**- ఏప్రిల్ 25 చరిత్రను మార్చే రోజు అవుతుంది**
**- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, : దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని..



కాళేశ్వరం మోటర్లను దెబ్బతీసే

## కుట్రలు

**- సరైన మెయింటెనెన్స్ లేకుండా చేస్తే ఎలా?**
**- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ**

హైదరాబాద్, ఏప్రిల్8 : కాళేశ్వరానికి సంబంధించి భారీ నీటిపారుదల మోటార్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్, మోటార్స్ పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా..

2వ పేజీలో...



కాల్పుల విరమణతో..

## ప్రపంచ శాంతి

**ఇదో గొప్ప సుదినమంటూ**

## ట్రంప్ పోస్ట్

వాషింగ్టన్, ఏప్రిల్8 : ఇరాన్‌తో కాల్పుల విరమణపై అమెరికా డీల్ కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ప్రకటన చేశారు. ప్రపంచ శాంతికి ఇది గొప్ప దినం అన్నారు. ఇరాన్ ఇదే కోరుకుంటోందన్నారు. తాజా వార్‌లో ఇరాన్ చాలా దెబ్బతిన్నట్లు చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో మళ్లీ చమురు నౌకల సందడి పెరుగుతుందని, దీనికి అమెరికా సహకరిస్తుందన్నారు. చాలా పాజిటివ్ యాక్షన్ ఉండబోతుందన్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదిస్తారని, ఇరాన్ మళ్లీ పునర్ నిర్మాణ పనలు మొదలుపెడుతుందన్నారు. ఇక రాబోయే రోజుల్లో పశ్చిమాసియాలో స్వర్ణ యుగం ఉండబోతుందన్నారు. తనకు నమ్మకం ఉందన్నారు.

2వ పేజీలో...

## కేంద్ర మాజీమంత్రి మొహిసినా కిద్వాయ్ మృతి



న్యూఢిల్లీ, ఏప్రిల్8 :సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్రమంత్రి మోహ్సినా కిద్వాయ్ మరణించారు. వయస్సు రిత్యా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె నొయిడాలోని మెట్రో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున మరణించినట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.00గంటలకు అంత్యక్రియలు జరపనున్నట్లు ఆమె అల్లుడు రజీ ఉర్ రెహ్మాన్ కిద్వాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో కిద్వాయ్ పలు కీలకమైన శాఖల బాధ్యతలను చేపట్టారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యురాలిగాను పనిచేశారు. గతంలో ఆమె కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో, పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీలో కూడా సభ్యురాలిగా పనిచేశారు.



కరీంనగర్ లో బీఆర్ఎస్

## ప్లీనరి

2వ పేజీలో...

కరీంనగర్, ఏప్రిల్ 8,: కేసీఆర్ మాటలనే అస్త్రాలుగా వాడతారు. పదునైన తన డైలాగులతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తారు. తీరా చూస్తే ఆచరణలో అవి పెద్దగా ముందుకు సాగవని విమర్శలు ఉన్నాయి. దానికి ఉదాహారణలు కూడా ఉన్నాయి. కేసీఆర్ గత ఏడాది పార్టీ ప్లీనరీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం కనుక చూస్తే తాను ఇక నుంచి జనంలో ఉంటాను అన్ బిగ్ స్టేట్మెంట్ ఇచ్చేశారు. ఈ రోజు నుంచి మీటింగుల మీద మీటింగులే, జనంలో ఉంటూ కాంగ్రెస్ సర్కార్ ని నిలదీస్తామని అన్నారు. కానీ ఆ తరువాత కేరాఫ్ ఫాం హౌస్ గానే కథ సాగింది. మళ్ళీ గత ఏడాది డిసెంబర్ నెలలో కేసీఆర్ మీడియా ముందుకు వచ్చరు. ఆయన మాట్లాడుతూ ఇక మీదట జనంలో ఉంటాం, కొత్త ఏడాది అంటీఅ 2026లో వరసగా అనేక జిల్లాలలో మీటింగ్స్ పెడతాం, ఇక సమరమే అని గర్జించారు. కానీ అది కూడా జరగలేదు. చూస్తూండగానే ఏడాది గడచిపోయింది. ఇక ఈసారి ప్లీనరీ ఎక్కడ అన్న చర్చ బీఆర్ఎస్ పార్టీలో సాగుతోంది. అయితే ఉమ్మడి కరీం నగర్ జిల్లాలో నిర్వహిస్తారు అని అంటున్నారు. దానికి కారణం ఉత్తర తెలంగాణాలో బీఆర్ఎస్ కారు జోరు తగ్గిది అన్న భావన ఉండడమే.

వాషింగ్టన్: అమెరికా శ్వేతసౌధం కీలక ప్రకటన చేసింది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ 38 రోజుల పాటు సాగినట్లు చెప్పింది. అయితే ఆ 38 రోజుల్లో తమ మిలిటరీ లక్ష్యాలను అందుకున్నట్లు వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లివియేట్ తెలిపారు. ఆమె తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ చేశారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ద్వారా అనుకున్నదాని కన్నా ఎక్కువే సాధించినట్లు చెప్పారు. ఇది అమెరికా విక్టరీ అని, ఈ విజయం ట్రంప్‌కు దక్కుతుందని, అసాధారణ సైన్యం ఈ విజయాన్ని నిజం చేసిందన్నారు. ఇరాన్‌పై సమరం సుమారు నాలుగు నుంచి ఆరు వారాల పాటు జరుగుతుందని మొదటి నుంచీ ట్రంప్ పేర్కొన్న విషయాన్ని వైట్‌హౌజ్ సెక్రటరీ తన పోస్టులో గుర్తు చేశారు. ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు..



2వ పేజీలో...

38 రోజుల ఆపరేషన్..

## ఎపిక్ ఫ్యూరీ

**అమెరికాదే విజయమన్న వైట్‌హౌజ్**

# ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం



మొదటిపేజీ తరువాయి...

ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత్'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబెనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని అంటోంది. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్టు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం. ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

# ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణయే ఎటిఎం

మొదటిపేజీ తరువాయి...

లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్లు రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరఫున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.

## బిజెపి చెప్పుచేతల్లో ఎన్నికల సంఘం

**ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు**



న్యూఢిల్లీ, ఏప్రిల్8 : భారత ఎన్నికల సంఘం బిజెపి కింద పనిచేస్తోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇసిపై తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఉదయం తృణమూల్ కాంగ్రెస్ బృందం భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ని కలిసి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికలు భయరహితంగా, హింసారహితంగా, బెదిరింపులు, ప్రలోభాలు, దాడులు లేకుండా జరపాలని కోరింది. అయితే ఇసికి, టిఎంసి బృందానికి మధ్య ఏడు నిమిషాల పాటు సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తాము చెప్పినవి వినకుండా ఇసి చీఫ్ జ్ఞానేశ్ కుమార్ ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని అవమానించినట్లుగా టిఎంసి బృందం వెల్లడించింది. టిఎంసి బృందానికి జరిగిన అవమానంపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలం. బిజెపి చెప్పినట్టే పనిచేస్తుంది. బిజెపి నుంచి నేరుగా అందే ఆదేశాలను ఇసి తీసుకుంటుంటోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ విషయం ఇప్పుడు బహిరంగమైంది. ఇది అత్యంత దురదృష్టకరం అని కేజ్రీవాల్ ఎక్స్ పోస్టులో ఇసిని విమర్శించారు.

## పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై అత్యాచారం

**యువతిపై ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ పలుమార్లు అఘాయిత్యం**

**ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**



హైదరాబాద్, ఏప్రిల్8 : బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై ట్రైనీ ఇన్ స్పెక్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సంస్థలో శిక్షణ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో నసీముద్దీన్ కు సహకరించిన దమ్మాయిగూడ కు చెందిన మరొక శిక్షణ ఇచ్చే ఇన్స్పెక్టర్ సల్మాన్. యువతి పై అత్యాచారం జరిపి వీడియోలు ఫోటోలు తీసుకుని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు నసీముద్దీన్. ట్రైనింగ్ కోసం వచ్చిన యువతిని మాయ మాటలతో లొంగ దీసుకున్న ట్రైనర్ నసిముద్దీన్.పలు మార్లు వేధింపులకుపాల్పడడంతో యువతిట్రైనింగ్ ఆపేసింది. 2025 అత్యాచారంజరిగిన ప్రాంతం బేగంపేటపరిధిలో ఉండడం తోబేగంపేట పోలిస్‌లకుఫిర్యాదుచేసింది. జనవరి2025 నుండి పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన బేగంపేట పోలీసులు నసీముద్దీన్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## 38 రోజుల ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ..

మొదటిపేజీ తరువాయి...

ఆకస్మిక దాడి చేశాయి. అయితే ఆ ఆపరేషన్ కనీసం 4 నుంచి 6 వారాల్లో ముగుస్తుందని ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికా మిలిటరీ సామర్థ్యం నమ్మశక్యం కానిదని, ఇక మిలిటరీ సంబరాలు చేసుకుంటున్నట్లు లివియేట్ పేర్కొన్నారు. మన యోధుల సామర్థ్యం అనిర్వచనీయమని, కేవలం 38 రోజుల్లోనే కీలకమైన మిలిటరీ లక్ష్యాలను అందుకున్నట్లు ఆమె చెప్పారు. రక్షణ శాఖ మంత్రి ఈపట్ హెగ్‌సెత్, త్రివిధ దళాల చీఫ్‌లతో పెంటగాన్ త్వరలో మీడియా బ్రీఫింగ్ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇన్నాళ్లూ బాంబు వర్షంతో ఇరాన్‌ను అతలాకుతలం చేసినా అమెరికా.. ఇప్పుడు దౌత్య మార్గంలో పరిష్కారాన్ని వెతుకుతున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో సమస్య పరిష్కారానికి దౌత్య మార్గం ఓపెన్‌గా ఉన్నట్లు తన పోస్టులో ప్రెస్ సెక్రటరీ తెలిపారు. మిలిటరీ సాధించిన విజయం వల్ల.. ఇరాన్‌తో దౌత్య చర్చలు చేపట్టేందుకు ట్రంప్‌కు అవకాశం వచ్చిందన్నారు. దీని వల్ల దీర్ఘకాలిక శాంతి వర్ధిల్లుతుందని ఆమె ఆశించారు. హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయబోతున్న అంశాన్ని కూడా లివియేట్ తన ట్వీట్‌లో రాశారు. ట్రంప్ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయవద్దు అని, అమెరికా ప్రయోజనాలు, శాంతి కోసం ఆయన పోరాటం చేస్తున్నట్లు లివియేట్ తన పోస్టులో వెల్లడించారు.

## కాళేశ్వరం మోటర్లను దెబ్బతీసే కుట్రలు

మొదటిపేజీ తరువాయి...

అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8,10, 11,12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. తక్షణమే మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. మీ రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.

# కరీంనగర్ లో బీఆర్ఎస్ ప్లీనరి




మొదటిపేజీ తరువాయి...

2023 ఎన్నికల్లో కూడా బలమైన ఈ ప్రాంతంలో సరిగా వర్క్ చేసుకోకపోవడం వల్ల దక్కాల్సిన సీట్లు కూడా దక్కలేదు అన్న భావనతో బీఆర్ ఎస్ పెద్దలు ఉన్నారుట. ఉద్యమ కాలం నుంచి కూడా తమకు అన్ని విధాలుగా కలిసి వచ్చి అచ్చి వచ్చిన ఉమ్మడి కరీంనగర్ లోనే ప్లీనరీ పెడితే అది మంచి ఊపు ఇస్తుందని ఆ మీదట రానున్న కాలమంతా బీఆర్ఎస్ కారు స్పీడ్ అందుకుంటుందని లెక్కలేస్తున్నారు అంతే కాదు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించే భారీ ప్లీనరీలోనే కాంగ్రెస్ కి రాజీనామా చేసి బయటకు వచ్చిన సీనియర్ నేత మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డిని కండువా కప్పి చేర్చుకుంటారు అని అంటున్నారు. ఆ విధంగా తమ బలం పెరిగింది అన్న సందేశాన్ని ఈ సభ సాక్షిగా ఇస్తారు అని అంటున్నారు. రాజకీయ అనుభవంలోనూ సీనియారిటీలోనూ కేసీఆర్ కి సమకాలీనుడు సరి జోడు అయిన జీవన్ రెడ్డి చేరికను కూడా ఒక సంబరంగా నిర్వహించి క్యాడర్ కి సందేశం ఇవ్వాలని చూస్తున్నారుట. ఇవన్నీ పక్కన పెడితే ఈ ప్లీనరీ తరువాత అయినా కేసీఆర్ జనంలోకి వస్తారా గట్టిగా మాట్లాడుతారా అన్న చర్చ సాగుతోంది. ఈ నెల 27న బీఆర్ఎస్ ప్లీనరీ ఉంది. ఆ సభలో కేసీఆర్ ఏమి మాట్లాడుతారు అన్నది కూడా అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే గత ప్లీనరీలో కేసీఆర్ ప్రసంగంలో పస లేదని సొంత కుమార్తె నాటి బీఆర్ ఎస్ మహిళా నాయకురాలు అయిన కవిత సంధించిన లేఖాస్త్రాలు అప్పట్లో వైరల్ అయ్యాయి. బీజేపీని విమర్శించడంలో పెద్దగా ఫోకస్ పెట్టలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. మరి ఈసారి కేసీఆర్ ఏ అస్త్రాలను సిద్ధం చేసుకుని సభకు వస్తున్నారో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ

మొదటిపేజీ తరువాయి...

బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె. జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది. చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

# పెద్దూరు లో పోలీసులు మీ కోసం కార్యక్రమం



సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దురులో పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు గంజాయి ,రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్స్ ,మహిళా చట్టాలు, షీ టీమ్, నూతన చట్టాలపై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఎవరైనా మోసపోయినట్లైతే 1930 నంబర్ కి పిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. సీసీ కెమెరాల వలన ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు. సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించాలని కోరారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఎలాంటి సమస్యలు వున్నా పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. ఏ సమ్యస వున్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలపాలన్నారు, లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారని అన్నారు.

## భవానీపూర్ లో మమత నామినేషన్

మొదటిపేజీ తరువాయి...



అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే. నా జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైంది' అని వ్యాఖ్యానించారు. మొత్తం 294 స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా.. పలువురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంపై మమత ఆందోళన వ్యక్తంచేశారు. 'ఓటర్ల జాబితా నుంచి అనేకమంది పేర్లను తొలగించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఓటరు తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో నాకు అర్థంకావడం లేదు. దీనికి వ్యతిరేకంగా మేం మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం' అని అన్నారు. భవానీపుర్ నుంచి మమత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దీదీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి భాజపా తన అభ్యర్థిగా సువేందు అధికారిని బరిలోకి దింపింది. ఇక, బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

## ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ : ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నెలకొల్పుతున్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ధర్పల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 30 పడకల స్థాయి నుంచి 100 పడకలకు పెంచుతూ ఏరియా ఆసుపత్రిగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసింది. అన్ని వసతులతో నూతన భవన నిర్మాణం కోసం రూ. 33.15 కోట్లను వెచ్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ధర్పల్లి ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి, చేపట్టాల్సి ఉన్న పెండింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులు మందకొడిగా కొనసాగుతుండడం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఎంతమంది కార్మికులు రోజువారీగా పనుల్లో పాల్గొంటున్నారని ఆరా తీశారు. పనులను వేగంగా జరిపించాలని, వచ్చే సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయించాలని గడువు విధించారు.

## కాల్పుల విరమణతో ప్రపంచ శాంతి

మొదటిపేజీ తరువాయి...

రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని విక్టరీగా చెప్పుకున్నారు. ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇండోనేషియా స్వాగతించింది. ఇరు దేశాలు సార్వభౌమత్వాన్ని గౌరవించాలని పేర్కొన్నది. దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు అని ఇండోనేషియా విదేశాంగ శాఖ ప్రతినిధి యెన్నె మివాంగ్‌కాంగ్ తెలిపారు.

## తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం

మొదటిపేజీ తరువాయి...

అక్కడ టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ .. సీఈసీపై గట్టిగా అరిచినట్లు తెలిసింది. ఆ సమయంలో సీఈసీ జ్ఞానేశ్, డెరిక్ ఒబ్రెయిన్ మధ్య వాగ్వాదం నడిచింది.తమను వెళ్లిపోవాలనిసీఈసీఅరిచినట్లు ఒబ్రెయిన్ ఆరోపించారు. కానీ టీఎంసీ నేత చేసిన వ్యాఖ్యలను ఈసీ కొట్టిపారేసింది. సీఈసీని కలిసినవారిలో మేనకా గురుస్వామి, సాగరికా ఘోష్, సాకేత్ గోకలే ఉన్నారు. 27 లక్షల మంది ఓటర్ల తొలగింపు అంశంలో ఈసీతో చర్చించేందుకు టీఎంసీ ప్రయత్నించింది. ఏప్రిల్ 23, 29 తేదీల్లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

# సంపాదకీయం

## రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు.ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు" అని అన్నారు.చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు.ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది.ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు.యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు?నిపుణులు ఏమంటున్నారు?ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవుసామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి.లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి.వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది.ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు.భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది.కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు."యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్."ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది" అని జ్యోత్స్నా యాజ్ఞిక్ చెప్పారు."చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆమె అభిప్రాయపడ్డారు."మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం" అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు"లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్-ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్-ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది" అని చెప్పారు.యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు" అని పూజా ప్రజాపతి అన్నారు.

# ఏపీ మీదుగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు



కర్నూలు : ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ మీదుగా మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా బెంగళూరు చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ తిరుపతి, నాయుడుపేట మీదుగా వెళ్లేందుకు కేంద్రం ఓకే చెప్పింది. ఈ కనెక్టవిటీతో అమరావతికి రెండో హైస్పీడ్ కారిడార్ లింక్ కానుంది. సీఎం చంద్రబాబు రిక్వెస్ట్ మేరకు కేంద్రం ఈ ఎలైన్‌మెంట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రెండు హైస్పీడ్ రైల్ కారిడార్లకు కనెక్ట్ కానుంది. వాస్తవానికి ఏపీ మీదుగా మూడు కారిడార్లు వెళుతుండగా.. రెండు కారిడార్లు అమరావతితో లింక్ కాబోతున్నాయి. హైదరాబాద్-చెన్నై కారిడార్‌ను ఇప్పటికే అమరావతితో కనెక్ట్ చేయాలని కేంద్రం నిర్ణయించగా.. తాజాగా మైసూరు-చెన్నై కారిడార్ విషయంలోనూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాజాగా బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌ను చిత్తూరు నుంచి తిరుపతి మీదుగా నాయుడుపేటకు లింకు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వినతతితో ఈ ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.ఇప్పటికే హైదరాబాద్ టు చెన్నై కారిడార్ అమరావతి మీదుగా గుంటూరు, చీరాల, ఒంగోలు, నెల్లూరు, నాయుడుపేట, శ్రీసిటీ మీదుగా చెన్నైకి ఏర్పాటు కానుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం నాయుడుపేట, తిరుపతి, చిత్తూరు, బంగారుపాళ్యం, బెంగళూరు, మాండ్య మీదుగా మైసూరుకు రెండో కారిడార్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రతో పాటుగా తమిళనాడు, కర్ణాటకలకు ఉపయోగపడేలా హైస్పీడ్ కారిడార్లను కేంద్రం ప్లాన్ చేసింది. వీటిలో హైదరాబాద్ టు చెన్నై, హైదరాబాద్ టు బెంగళూరు, బెంగళూరు-చెన్నై కారిడార్లు ఉన్నాయి. అయితే ఈ కారిడార్లలో తిరుపతిని చేర్చలేదు.బెంగళూరు-చెన్నై కారిడార్‌ను చిత్తూరు, తిరుపతి మీదుగా నాయుడుపేటకు కనెక్ట్ చేయలని చంద్రబాబు నాయుడు కేంద్రానికి ప్రతిపాదించారు. హైదరాబాద్-చెన్నై కారిడార్ ఎలైన్‌మెంట్‌లో ఇప్పటికే అమరావతిని కనెక్ట్ చేయగా.. తాజా ప్రతిపాదనలతో అమరావతికి, చెన్నై, బెంగళూరుతోపాటు మైసూరుతోనూ హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీనికి సంబంధించి, వచ్చే ఏడాది నాటికి డీపీఆర్ రూపొందించాలని భావిస్తున్నారు. హైదరాబాద్-చెన్నై ఎలైన్‌మెంట్‌ను రైల్వేశాఖ ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపాదించింది. హైదరాబాద్-బెంగళూరు మార్గం రాయలసీమ ప్రాంతం మీదుగా వెళుతోంది. మరో హైస్పీడ్ కారిడార్ బెంగళూరు-చెన్నై మధ్య ప్లాన్ చేసింది. అయితే ఈ అంశాలపై క్లారిటీ రావాల్సి ఉంది.హైదరాబాద్-బెంగళూరు కారిడార్ ఏపీలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళుతుంది. చెన్నై-బెంగళూరు మధ్య కారిడార్ ఏపీలోని చిత్తూరు జిల్లా మీదుగా వెళ్లేలా గతంలో ప్లాన్ చేశారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం రిక్వెస్ట్‌తో తిరుపతి, నాయుడపేటను కూడా ఈ అలైన్‌మెం? చేర్చారు. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా వెళుతుంది.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని నిరసన



జగిత్యాల జిల్లా: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ వద్ద మొక్కజొన్న రైతులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు అక్కడ అరబోసిన మొక్కజొన్న పంటను ను పరిశీలించి ఎండలకు ఎండిపోయి వజను తక్కువ అయి రైతులకు చాలా నష్టం కలిగేలా ఉందని అన్నారు.మన పక్కమండలాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికిని మల్లాపూర్ లో ఇంకా ప్రారంభం కాలేదు.మొక్కజొన్న రైతులు అరిగోసలు పడడం కిసాన్ సెల్ నాయకులకు కనబడడం లేదా..? కిసాన్ సెల్ అని చెప్పుకుని తిరిగే నాయకులు రైతులకు న్యాయం చేయాలి కదా మరి నాయకులు ఉన్నారా.. లేరా..? అని ఆరోపించారు.ఈ నెల పదోతారీకు వరకు కొనుగోలు కేంద్రం ప్రారంభించకుంటే రైతుల పక్షాన రిలే నిరాహార దీక్షలు చేపట్టి వంట వార్పు వంటి కార్యక్రమాలు చేసి కొనుగోలు కేంద్రం ప్రారంభించేంతవరకు ఉద్యమాన్ని ఆపమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ తోట శ్రీనివాస్ తోట రాజ రెడ్డి మాజీ జడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి దేవా మల్లయ్య మాజీ ఏఎంసీ వైస్ చెర్మెన్ ముద్దం శరత్ గౌడ్ రాంరెడ్డి బండిలింగస్వామి మొరపుగంగరాజాం మ్యాకాల సతీష్ ఉయ్యాల లక్ష్మణ్ బొక్కల నాగరాజు శ్రీనివాస్ రామ గౌడ్ రవి రాజేశ్వర్, మకిలి రాకెష్, పెద్దిరెడ్డి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# బసంతాపురం గ్రామంలో ఐ.కె.పి సెంటర్ ప్రారంభం



రాజపేట (తెలంగాణ వాణి విలేకరి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బసంతాపురం గ్రామంలో నూతనంగా ఐకెపి సెంటర్ ఏర్పాటు చేయించినందుకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు బసంతపురం సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్ల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో బసంతపురం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం లేనందువలన రైతులు తమ పండించిన దాన్యమును ఇతర గ్రామాలకు తీసుకెళ్లి అమ్ముకోవడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని, అలాగే కొంతమంది ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకోవడంతో రైతులు మోసపోవడం జరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో ఐకెపి సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ను కోరడంతో వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వడ్ల కొనుగోలు కేంద్రం మంజూరు చేయించారు.

# ఎండిఆర్-టీబీ చికిత్సలో శస్త్రచికిత్స కీలకం

### వైద్య రంగంలో అధునాతన విధానాలు

### యశోద హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ మంజునాథ్ బాలే




కరీంనగర్ (తెలంగాణ వాణి): భారతదేశంలో ప్రధాన ప్రజారోగ్య సవాలుగా మారిన మల్టీడ్రగ్- రెసిస్టెంట్ ట్యూబర్క్యులోసిస్ (ఎండిఆర్-టీబీ) నివారణలో బహుళ విభాగాల సమన్వయం ఎంతో అవసరమని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ కన్సల్టెంట్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ మంజునాథ్ బాలే అన్నారు. బుధవారం యశోద హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ?సాధారణ టీబీ మందులకు లొంగని వ్యాధిని ఎండిఆర్-టీబీ గా పరిగణిస్తారని, దీని చికిత్స అత్యంత క్లిష్టమైనదని వివరించారు. డ్రగ్ థెరపీ ఈ వ్యాధి చికిత్సకు పునాది అయినప్పటికీ, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో శస్త్రచికిత్స ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఊపిరితిత్తుల భాగానికి వ్యాధి పరిమితమైనప్పుడు, నిరంతర ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు, ఊపిరితిత్తులు దెబ్బతిన్న సందర్భాల్లో శస్త్రచికిత్సను సిఫార్సు చేస్తామన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి లోబెక్టమీ, సెగ్మెంటెక్టమీ వంటి అధునాతన విధానాలను అనుసరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాధి నిర్వహణలో పల్మోనాలజిస్టులు, సర్జన్లు, మైక్రోబయాలజిస్టుల సమన్వయం రోగి ప్రాణాలను కాపాడుతుందని స్పష్టం చేశారు. టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, మందుల వాడకంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విరామం ఇవ్వకూడదని ఆయన సూచించారు. అనంతరం కరీంనగర్ కు చెందిన మహిళాకు యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ లో విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం మహిళా ఆమె తండ్రి యశోద హాస్పిటల్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మాతా శిశు సంరక్షణకు కృషి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల బ్యూరో (తెలంగాణ వాణి): ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు చేయడం ద్వారా మాత శిశు సంరక్షణకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య ఆర్.ఎం.ఓ. శ్రీధర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వంహొప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. శుద్ధమైన త్రాగునీరు నాణ్యమైన పోషక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని వ్యాధులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు గర్భిణీల వివరాలు నమోదు చేసి సమయానుసారంగా చేసుకోవలసిన వైద్య పరీక్షలు తీసుకోవలసిన ఆహారం పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంపొందించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రాథమిక ఆసుపత్రులు సామాజిక ఆసుపత్రులు ప్రభుత్వ ఆసుపత్రులు పల్లె పట్టణ దవాఖానాలు ప్రభుత్వ వైద్య నర్సింగ్ కళాశాలల ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం మాతా శిశు ఆసుపత్రి ఉన్న ప్రాంతంలో వరద నీటి ఇబ్బంది ఉన్నందున త్వరలో పూర్తి కానున్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. లక్షెట్టిపేట సామాజిక ఆసుపత్రి బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చెన్నూర్ మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ మండల జిల్లా స్థాయిలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని ఆశ ఆరోగ్య కార్యకర్తల నుండి వైద్యుల వరకు గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం స్టాఫ్ నర్సులు సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని స్నేహపూర్వక వాతావరణం లో వైద్య చికిత్స అందించాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధిహొహొదిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు ఈ కార్యక్రమం లో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల (తెలంగాణ వాణి): కోరుట్ల అసెంబ్లీ నియో జకవర్గంలోని మూడు మండ లాల్లో ఈ నెల 9న మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభశీకానున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయ కులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు.బుధవారం ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి మార్క్ ఫెడ్ ఎండిని అత్యవసరంగా కోరుట్ల నియో జకవర్గం పరిధి మూడు మండ లాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించను న్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు తెలిపారు.మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు మంజూరుకు సహకరించిన బడుగు, బలహీన వర్గాల నేత, ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కోరుట్ల నియోజకవర్గ రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

# వృద్ధురాలి దారుణ హత్య

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల లో అదృశ్యమైన వృద్దురాలు అస్తిపంజరమై దొరికింది. పోలీసుల వివ రాల ప్రకారం.. మండలంలోని బండవెల్కిచర్లకు చెందిన వెంకటమ్మ(63) శనివారం ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లింది. సాయం త్రమైనా తిరిగిరాకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె కూతురు లక్ష్మి తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆది వారం కుల్కచర్ల పీఎస్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె కాల్ లిస్ట్ ఆధారంగా పక్కింటి మహిళ మంజులను విచా రించగా తన భర్త భీమయ్యతో పాటు బంధువు బీరయ్యతో కలిసి చంపినట్లు తేలింది. వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారం కోసం ఆమెను ద్విచక్ర వాహనం ఎక్కించుకుని తిర్మలాపూర్ గ్రామ సమీపంలోని పాండవుల బండపైకి తీసుకెళ్లి గొంతునులిమి చంపారు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించారని ఎస్ఐ రమేశ్ తెలిపారు.








# అనగనగా.. కథాతీతం!

కథ చెబుతూ నిద్రపుచ్చాల్సిన నాన్న.. ల్యాపీతో బిజీ! కథలు చెబుతూ బువ్వ తినిపించాల్సిన అమ్మ.. ఆఫీస్ వర్క్‌లో బిజీబిజీ!తాతయ్య, బామ్మ ఊళ్లో! చిన్నకుటుంబాల్లో పెరుగుతున్న చిన్నారులు ఎదుర్కొంటున్న పెద్ద చిక్కు ఇది. కథలు చెప్పే తీరిక లేక స్మార్ట్ ఫోన్ చేతికిస్తున్నారు తల్లిదండ్రులు. దీంతో చందమామ కథలా సాగిపోవాల్సిన వారి బాల్యం.. రీల్స్‌లో చిక్కుకుపోతున్నది. ఫలితం.. ఉన్నతమైన పౌరులుగా ఎదగాల్సిన చిన్నారులు చిన్న వయసులోనే తీవ్ర ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితికి విరుగుడు కథ చెబుతున్నది 'కథాతీతం' గ్రంథాలయం. కాంక్రీట్ వనంలో పల్లెటూరి ఇంటిని తలపించే లోగిలిలో ఈ లైబ్రరీని నెలకొల్పారు శిల్పా కిరణ్‌వీర్.
పిల్లలకు నీతికథా సుధను పంచుతున్న శిల్పా పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే.. పండుగ వేళల్లో.. ఆ పర్వం ప్రాముఖ్యాన్ని తెలిపేలా కథ రూపంలో, డ్రామా రూపంలో కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం. పిల్లల్లో వచ్చిన మార్పు గురించి తల్లిదండ్రుల అభిప్రాయాలు కూడా తెలుసుకుంటాం. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ ఏడాది 'రచన' పేరుతో ఏప్రిల్13 నుంచి మే 30 వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. ఇందులోప్రధానంగా కథలుచెప్పడం, వ్యాస రచన పోటీలు, నాటికలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నాం. నా చిన్నతనంలో నేర్చుకున్న నీతి కథలే నా జీవితానికి ఒక మార్గాన్ని చూపించాయని నమ్ముతాను. నేను పుట్టింది మైసూర్, మెట్టినిల్లు తెలంగాణ. మా నాన్న థియేటర్ ఆర్టిస్ట్‌గా ఉండేవారు. కుటుంబ విలువలు తెలిపే నాటికలు ప్రదర్శిస్తుండేవారు. నాటికల మీద ఆసక్తితో నేను బాలనటిగా ఎన్నో నాటికల్లో పాల్గొన్నాను. నాటికల ద్వారా ప్రజలకు ఎంతోకొంత నీతి నేర్పించవచ్చని తర్వాతి కాలంలో తెలిసొచ్చింది. వివాహం అయిన తరువాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డాను. తల్లిగా నా పిల్లలకు నీతి కథలు చెబుతూ ఉండేదాన్ని. వాళ్లను విద్యారణ్య పాఠశాలలో చేర్పించినప్పుడు ఆ వాతావరణం నన్ను ఎంతగానో ఆకర్షించింది. వెంటనే నా ఉద్యోగానికి రాజీనామా చేసి అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరాను. అందుకోసం ప్రత్యేక కోర్స్ కూడా చేశాను.తెలంగాణ పర్యాటకం: నిజానికి చిన్నప్పటినుంచి టీచర్ కావాలనే కోరిక కూడా ఉండేది. కానీ, పరిస్థితుల ప్రభావం ఐదేండ్లపాటు సాఫ్ట్‌వేర్ కొలువు చేయాల్సి వచ్చింది. కానీ, నా పిల్లల వల్ల నాకు నచ్చిన వృత్తిలో చేరడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. అక్కడ విద్యార్థులకు కథలు చెప్పడమే నా పని. హ్యాపీగా నా పని నేను చేసుకుంటూ ఉండేదాన్ని.
పిల్లల భాగస్వామ్యం లేదని..: కరోనా సమయంలో స్టోరీ టెల్లింగ్‌తో ఇతర సబ్జెక్టులు కూడా నేర్పించాలని చెప్పారు. దాంతో ఈ సబ్జెక్టులను కూడా కథల రూపంలోనే చెప్పడం మొదలుపెట్టాను. అలా బోధించడం నాకు ఆనందాన్ని ఇచ్చినా పిల్లలు మాత్రం తమ అభిప్రాయాన్ని చెప్పేందుకు సమయం సరిపోయేది కాదు. నాకున్న నలభై నిమిషాల్లో కథ చెప్పి ఒక్కొక్కరి అభిప్రాయం తెలుసుకునేందుకు వీలుపడేది కాదు. పిల్లలు ఎంతో ఆశతో 'మేడం! మేం చెబుతాం' అని చేతులు పైకెత్తి అడిగినా.. వారికి అవకాశం ఇవ్వడం కుదరలేదు. పిల్లల కోసం చెప్పే కథల్లో.. వాళ్ల భాగస్వామ్యం లేదనే బాధతో 2023లో అక్కణ్నుంచి బయటికి వచ్చేశా. నేను కథలు చెబుతానని చాలా మందికి తెలుసు. ఉద్యోగం వదిలేసి ఇంట్లోనే ఉంటున్నానని తెలిసి మా చుట్టు పక్కల పిల్లలు 'కథలు చెప్పండి ఆంటీ!' అంటూ రావడం మొదలు పెట్టారు. నేనూ పిల్లలకు కథలు చెప్పడానికి సిద్ధమయ్యా! అందరు పిల్లలకు ఒకేసారి కాకుండా, ఒక్కో చిన్నారికీ గంట సమయం కేటాయిస్తూ కథ చెప్పేదాన్ని. తర్వాత వారికి ఏం అర్థమైందో, ఏమైనా సందేహాలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకునేదాన్ని. అందుకే గ్రంథాలయం: విద్యారణ్యలో, చుట్టుపక్కల ఉండే పిల్లల్లో కథలు వినడం వల్ల కలిగే మార్పును దగ్గరనుంచి గమనించాను. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌తో పుట్టి పెరుగుతున్న ఈ తరం చిన్నారులకు కథల అవసరం చాలా ఉంది. వారికి మార్గనిర్దేశనం చాలా అవసరం. ఈ మేరకు ఏడు నెలల కిందట గచ్చిబౌలిలో 'కథాతీతం' పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేశాను. హిందీ, ఇంగ్లిష్, తెలుగు కథల పుస్తకాలు అందుబాటులో ఉంచాను. ఇక్కడ దాదాపు ఐదువేల పుస్తకాలు ఉన్నాయి. ఒక్క సోమవారం మినహాయించి వారంలో మిగతా రోజులన్నీ మా కథాతీతం తెరిచే ఉంటుంది. చిన్నారులు తమ తల్లిదండ్రులతో లేదా స్నేహితులతో కలిసి వచ్చి తమకు నచ్చిన పుస్తకం తీసుకొని చదువుతుంటారు. ఏవైనా సందేహాలు ఉంటే కూడానన్ను అడిగి నివృత్తి చేసుకుంటారు. ఆ తరువాత నేను వాళ్లకు కథలు చెబుతూ వారి అభిప్రాయాలు అడుగుతుంటాను. కథల పుస్తకాల్లో ఉన్న బొమ్మలు వేసేందుకు కావాల్సినపేపర్,పెన్సిల్ కూడా సిద్ధం చేసి ఇస్తుంటాం. పజిల్స్ కూడా పెడతాం. పుస్తకాలు చదివించడంతో పాటు ఇతర కెరీర్ గైడెన్స్ క్లాస్‌లు కూడా నిర్వహిస్తున్నాం.
అదే మా ఆలోచన: చాలామంది లైబ్రరీ అంటే టేబుళ్లు, కుర్చీలు ఉండే గదిలా ఊహించుకుంటారు. కానీ, కథాతీతం అలా ఉండదు. మనం పుట్టిపెరిగిన పల్లెటూరిలో ఉండే పెంకుటిళ్లు లాగా అందంగా ఉంటుంది. పిల్లలు కూడా ఇంట్లో ఉన్నామనే అనుభూతి చెందాలనే ఆలోచనతోనే దీనినిఇలా తీర్చిదిద్దాం.ఒక్కసారి కథాతీతంలోకి వచ్చిన పిల్లలు పక్కన ఫోనున్నా.. దాన్ని పట్టించుకోకుండా, తమకు నచ్చిన పుస్తకంలో నిమగ్నమై చదువుకుంటూ ఉంటారు. మేం కూడా పిల్లల ముందు ఫోన్ వినియోగించం. పిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు కూడా ఫోన్ వాడొద్దనిచెబుతాం. ఈ గ్రంథాలయంలో రెండో తరగతి పిల్లల నుంచి మొదలు పదోతరగతి చదివే విద్యార్థుల వరకు వస్తుంటారు. 40మంది చిన్నారులు రెగ్యులర్‌గా వస్తున్నారు. తమ పిల్లలు నిజాయతీగా జీవించాలని ప్రతి తల్లిదండ్రులూ కోరుకుంటారు. మా కథలతో అలాంటి తరాన్ని తయారు చేయాలన్నదే ఈ కథాతీతం లక్ష్యం. ఇప్పుడిప్పుడే ప్రారంభమైన మా జర్నీ.. వందల, వేల మంది పిల్లలను ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకుసాగుతున్నాం.

# కడప జిల్లాలో కుక్కల దాడిలో చిరుత కూన మృతి



కడప : వైఎస్సార్ కడప జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కుక్కల గుంపు దాడిలో ఓ చిరుత పులి కూన మృతి చెందింది. దువ్వూరు మండలం చిన్నబకరాపురం గ్రామ శివార్లలో ఈ సంఘటన వెలుగు చూసింది. తీవ్రమైన ఎండల కారణంగా అడవిలో నీటి వనరులు అడుగంటిపోవడంతో, దాహం తీర్చుకోవడానికి చిరుత కూన గ్రామంలోకి వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. గ్రామ శివార్లలోని రైతు పుల్లారెడ్డి పొలంలో చిరుత కూన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. నీటి కోసం వచ్చిన చిరుతను వీధి కుక్కలు చుట్టుముట్టి తీవ్రంగా దాడి చేయడంతో అది ప్రాణాలుకోల్పోయిందని గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ డీఆర్ఓ అన్వర్ హుస్సేన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం, చిరుత కూన మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత కూన మృతి చెందడంతో పొలాల్లో చిరుత పులుల సంచారం ఉందేమోనని రైతులు, పశువుల కాపరులు ఆందోళన చెందుతున్నారు.

## తమిళనాడులో అధిక సంపన్న అభ్యర్థి లీమా..

### ఆమె ఆస్తులు విలువ ఎంతో తెలుసా..?



చెన్నై : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 58 ఏళ్ల అన్నాడీఎంకే అభ్యర్థిని లీమా రోజ్ అత్యధిక సంపన్నురాలిగా నిలిచారు. ఆమె కుటుంబ ఆస్తుల విలువ రూ.5,863 కోట్లు కాగా, స్వయంగా ఆమె ఆస్తుల విలువే రూ.1,049 కోట్లుగా ఉన్నది. తిరుచ్చి జిల్లా లాల్గుడి నియోజకవర్గం నుంచి లీమా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగారు. లీమా లాటరీ టికెట్ల విక్రయ సంస్థ అధినేత మార్టిన్ సతీమణి. ఆమె ఇటీవలే అన్నాడీఎంకే పార్టీలో చేరారు. లీమా తన నామినేషన్‌తో పాటు సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను వెల్లడించారు. తన పేరిట 19 కిలోల బంగారం, 1,217 క్యారెట్ల వజ్రాలు, 13 కిలోల వెండి, 33 గ్రాముల ప్లాటినం ఉన్నాయని ఆమె తెలిపారు. తనకు రూ.139.63 కోట్ల చరాస్తులు, రూ.909.94 కోట్లు స్థిరాస్తులు, రూ.8.57 కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా తన భర్త మార్టిన్ పేరిట రూ.4,100 కోట్ల పైచిలుకు ఆస్తులు ఉన్నాయని వెల్లడించారు. అందులో రూ.887.36 కోట్ల విలువైన చరాస్తులు, రూ.3,262 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా తన భర్త పేరిట 281 గ్రాముల బంగారం, 9.83 క్యారెట్ల వజ్రాలు, 21 కిలోల వెండి, 321 గ్రాముల విలువైన ముత్యాలు ఉన్నాయని లీమా తన అఫిడవిట్‌లో స్పష్టంచేశారు. కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్ పేరిట కూడా రూ.655 కోట్లు విలువైన ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. తన కుటుంబం మొత్తం ఆస్తుల విలువ సుమారుగా రూ.6 వేల కోట్లు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఆమె ఆరో తరగతి వరకు మాత్రమే చదువుకున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనపై నాలుగు పెండింగ్ కేసులు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

# పాల నుంచి పన్నీర్ దాకా.. టూత్‌పేస్ట్ నుంచి అల్లం పేస్ట్ దాకా..

## కల్తీలపై విస్తుపోయే నిజాలు వెలుగులోకి!

న్యూఢిల్లీ, : భారతీయులు ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రపోయే వరకు ఉపయోగించే దాదాపు అన్ని వస్తువులు కల్తీ అవుతున్నాయి. పాల నుంచి పన్నీర్ దాకా, టూత్ పేస్ట్ నుంచి అల్లం వెల్లుల్లి పేస్ట్ దాకా అన్నీ కల్తీ అవుతున్నట్టు గత నెలలో ఆహార భద్రత అధికారులు జరిపిన దాడుల్లో వెల్లడైంది. కల్తీ వస్తువులు అమ్మే నేరగాళ్లు ఒక సిండికేట్‌గా ఏర్పడి పరిశ్రమ స్థాయిలో ఈ నకిలీలను ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదివరకు ఖరీదు ఎక్కువగా ఉండే విలాస వస్తువులను మాత్రమే కల్తీ చేసే దుండగులు ఇప్పుడు సామాన్యులు రోజువారీ ఉపయోగించే దాదాపు అన్ని వస్తువులను కల్తీ చేస్తున్నారు. దీంతో ప్రజలు తమ డబ్బును కోల్పోవడమే కాకుండా రసాయనాలతో తయారైన ఉత్పత్తులను వాడటం ద్వారా తమ ఆరోగ్యానికి ముప్పును కొని తెచ్చుకుంటున్నారు.
ఢిల్లీలో టూత్‌పేస్ట్ రాకెట్: ఢిల్లీ పోలీస్ క్రైమ్ బ్రాంచ్ సిబ్బంది.. భారతీయుల గృహాల్లో సాధారణంగా వినియోగించే వస్తువులను కల్తీ చేస్తున్న ఓ అధునాతన పరిశ్రమను గత గురువారం కూల్చివేశారు. కాంజీవాలాలోని ఓ కేంద్రంలో టూత్‌పేస్ట్, కూల్ డ్రింక్స్‌ను కల్తీ చేస్తున్నట్టు కనుగొని దానిపై దాడులు జరిపారు. ఇక్కడి ఓ ఫ్యాక్టరీలో తయారవుతున్న లోపభూయిష్టమైన టూత్‌పేస్ట్‌కు సెన్సోడైన్ లేబుల్ వేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు కనుగొన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న ఆ టూత్‌పేస్ట్ వినియోగానికి పనికిరాదని తేల్చారు. ఫ్యాక్టరీ యజమానిని అరెస్టు చేశామని క్రైంబ్రాంచ్ డీసీపీ పంకజ్‌కుమార్ తెలిపారు. గత నెల 31న ఢిల్లీ పోలీసులు మరో చోట దాడులు చేసి గడువు తీరిన ఆహార పదార్థాలు, కూల్‌డ్రింక్స్‌కు కొత్త తేదీలు వేస్తున్నట్టు కనుగొన్నారు. ఓ రసాయనం సాయంతో ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్‌ల డబ్బాలపై ఉన్న ఎక్స్‌పైరీ డేట్‌ను తుడిచివేసి, కొత్తగా ఏడాది తేదీలు వేస్తున్నారని డీసీపీ హర్ష్ ఇందోరా తెలిపారు. ఇక్కడి నుంచి 600 థమ్స్‌అప్ క్యాన్‌లు, 840 స్ప్రైట్, 480 లిమ్కా, 1,176 కోకాకోలా క్యాన్‌లతోపాటు పలు బ్రాండ్‌ల బిస్కెట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.
సూరత్‌లో కల్తీ పన్నీర్: గుజరాత్ రాష్ట్రం, సూరత్ నగరంలోని పండేసరా ప్రాంతంలోని ఓఫ్యాక్టరీపై సూరత్ ఆహారభద్రత విభాగం, సూరత్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ దాడులు జరిపి 1,401 కిలోల కల్తీ పన్నీర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేంద్రానికి ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ ఉండటం గమనార్హం. ఇక్కడ తయారవుతున్న పన్నీర్‌ను ల్యాబ్‌లో పరీక్షించినప్పుడు అత్యంత లోపభూయిష్టంగా ఉన్నట్టు వెల్లడైందని డీసీపీ రాజ్‌దీప్‌సింగ్ నకుం తెలిపారు. ఈ కేంద్రంలో ఇంకా రూ.28 లక్షల విలువైన నకిలీ ఎసిటిక్ యాసిడ్, పామ్‌ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మరోవైపు గత ఫిబ్రవరిలో సబర్‌కాంత జిల్లాలో యూరియా, డిటర్జెంట్ వాడి కల్తీపాలు తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు.
సోషల్ మీడియాపై కేసులు: ఓ వైపు కల్తీ వస్తువులు విశృంఖలంగా మార్కెట్లలో విక్రయమవుతుండగా, ఈ విషయాలను సామాజిక మాధ్యమాలలో పంచుకున్నందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ కేసులు నమోదుచేసింది. మార్కెట్‌లో కల్తీ పన్నీర్, కల్తీ పాలు విస్తారంగా లభిస్తున్నాయని, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏం చేస్తున్నదని ప్రశ్నించిన నెటిజన్లపై కేసులు నమోదయ్యాయి. చట్ట విరుద్ధంగా తమ సంస్థకు చెందిన వెబ్‌సైట్‌ల నుంచి పత్రాలను తస్కరించి, తాము సేకరించిన సమాచారాన్నే నెటిజన్లు వివిధ సామాజిక మాధ్యమాలలో వైరల్



చేస్తున్నారని సంస్థ ఆరోపించింది.
హైదరాబాద్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్: గత నెల చివర్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రాడక్ట్స్ యజమాని హసన్‌అలీ రూపాణీని అరెస్టు చేశారు. ఎస్‌కేఆర్ ఫుడ్స్‌లో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో నాణ్యత లేని ముడి సరుకుతో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారుచేస్తున్నట్టు కనుగొన్నారు. అల్లం వెల్లుల్లి పొట్టును కూడా పేస్ట్‌లో కలుపుతున్నట్టు తెలుసుకున్నారు. ఇక ఈ పేస్ట్‌లో హానికరమైన ఎసిటిక్ యాసిడ్, గ్జాంతన్ గమ్ పౌడర్‌ను కలుపుతున్నట్టు కనుగొన్నారు. తయారైన పేస్ట్‌ను ప్లాస్టిక్ డబ్బాలలో మూతలు లేకుండా పెట్టడంతో వాటిపై ఈగలు, దోమలు, ఇతర క్రిమికీటకాలు వాలుతున్నాయని, ఇవి ఆరోగ్యానికి హానికరమని అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ 4,032 కిలోల అల్లం వెల్లులి పేస్ట్‌ను, 6,210 కిలోల అల్లం, ఎల్లిగడ్డను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పరిసరాలలోని మల్లాపూర్‌లో ఆహార భద్రతా విభాగం గత నెల 29న జీడీపప్పును రీప్యాకేజింగ్ చేస్తున్న కంపెనీపై దాడులు జరిపింది. సుమారు 36 కిలోల జీడిపప్పుకు పురుగులు పట్టాయని, నాణ్యత లేని మరో 210 కిలోల (రూ.1.5 లక్షల విలువైన) జీడిపప్పును స్వాధీనం చేసుకున్నామని తెలిపింది.

# హెచ్‌ఆర్సీ ఎదుట మహిళా ఆత్మహత్యాయత్నం



హైదరాబాద్ : హైదరాబాద్ నాంపల్లిలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దొంగతనం కేసులో తనను తీసుకెళ్లి, విచక్షణారహితంగా కొట్టారని, తాను పనిచేసే అపార్ట్‌మెంట్‌లో పరువు తీశారని ఆవేదన వ్యక్తం చేసింది. అందుకే తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొంది. వివరాల్లోకి వెళ్తే.. కవాడిగూడకు చెందిన శ్రావణి అదే ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఐదేళ్లుగా పనిచేస్తుంది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఆమె నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని

## కీలక విషయాలు వెలుగులోకి!

కవాడిగూడకు చెందిన శ్రావణి ఆత్మహత్యకు యత్నించింది. . కమిషన్ వద్ద విధుల్లో ఉన్న పోలీసులు వెంటనే తేరుకొని బాధితురాలు శ్రావణిని అడ్డుకొని ఆమె చేతిలోని పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. సదరు మహిళను కమిషన్ చైర్మన్ వద్దకు తీసుకువెళ్లారు. కవాడిగూడలోని ఓ అపార్ట్‌మెంటులో ఐదేళ్లుగా పనిచేస్తున్నానని శ్రావణి తెలిపింది. ఇటీవల బంగారం దొంగతనం జరిగిందని అపార్ట్‌మెంట్ యజమాని ఇందిరా ప్రియదర్శిని గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపింది. అయితే పోలీసులు ఆ దొంగతనం కేసులో తనను అనుమానితురాలిగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని పేర్కొంది. అక్కడ తనను విచక్షణారహితంగా కొట్టారని.. దొంగతనం చేసిందని అపార్ట్‌మెంట్ అంతా తన ఫొటోలను పోస్టర్లుగా అంటించారని వాపోయింది. ఈ ఘటనలతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపింది. ఈ ఆరోపణలపై మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకుంది. కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టింది. దీనిపై సవివరమైన నివేదిక సమర్పించాలని నగర పోలీస్ కమిషన్‌కు సిఫారసు చేసింది. ఈ నెల 30వ తేదీలోపు పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించింది.

# యురేనియం అంశంలో జాగ్రత్తలు తీసుకుంటాం: డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్ వద్ద ఉన్న శుద్ధీకరించిన యురేనియం గురించి ఎవరూ బాధపడాల్సినఅవసరం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. యురేనియం విషయంలో ఫర్ఫెక్ట్ కేర్ తీసుకుంటామన్నారు. టెహ్రాన్‌తో రెండు వారాల పాటు కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన కీలకమైన యురేనియం అంశంపై స్పందించారు. అంతర్జాతీయ మీడియా సంస్థ ఏఎఫ్‌పీతో జరిగిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. యురేనియం అంశంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటామని, ఒకవేళ ఆ అంశంపై డీల్ కుదరకుంటే తానేమీ తగ్గేవాడిని కాదన్నారు. ఇరాన్‌పై సాగిన సమరంలో అమెరికా పూర్తిగా, సమగ్రమైన విజయాన్ని సాధించిందని, ఇది 100 శాతం విక్టరీ అని, దీంట్లో ప్రశ్నలు లేవనెత్తే అంశమేలేదన్నారు. ఇరాన్ వద్దసుమారు 500 కిలోల శుద్ధీకరించిన యురేనియం ఉన్నట్లు కొన్ని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే 38 రోజులుగా సాగిన యుద్ధం కూడా యురేనియం కోసమే అన్న ఆరోపణలు వస్తున్నాయి.అమెరికాతో కాల్పుల విరమణకు ఇరాన్ అంగీకరించినా.. ఆ దేశం మాత్రం యురేనియం అంశంలో పట్టుపట్టినట్లు తెలుస్తోంది. శుద్ధీకరించిన యురేనియం నిల్వలు తమ వద్దే ఉంచుకునేందుకు అమెరికాపై వత్తిడి తెచ్చే ప్రయత్నం చేసినట్లు భావిస్తున్నారు. మధ్యవర్తుల సమక్షంలో 10 పాయింట్ల ప్లాన్‌కు అమెరికా,ఇరాన్ పరస్పరం అంగీకరించాయి. కానీ యురేనియం శుద్ధీకరణ ప్రోగ్రామ్‌కు అనుమతి ఇవ్వాలని అమెరికాను ఇరాన్ వేడుకున్నట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం అంశంలో ఇరాన్‌ను చైనా ప్రోత్సహించినట్లు తెలుస్తోందని



ట్రంప్ తెలిపారు. దౌత్యం దిశగా ఇరాన్‌ను చైనా ఒప్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సమకూర్చుకోవద్దు అంటే, అప్పుడు ఆ దేశానికి యురేనియం అందకుండా చేయాలని, ఈ అంశంలో అమెరికా పట్టుపట్టినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో జరిగే శాంతి ఒప్పందంలో యురేనియం ప్రస్తావన తప్పకుండా ఉంటుందన్నారు. ఇరాన్‌ను దౌత్యమార్గం వైపు మళ్లించడంలో చైనా కీలక పాత్ర పోషించిందన్నారు. మే నెలలో ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ఆయన భేటీ కానున్నారు. ఏప్రిల్‌లో జరగాల్సిన ఆ మీటింగ్‌ను ఇరాన్ వార్ వల్ల వాయిదా వేశారు. అమెరికాతో యుద్ధం సమయంలో ఇరాన్‌కు చైనా సహకరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇరానీ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న దేశంలో చైనా అగ్రస్థానంలో ఉన్నది.

# మ్యాచ్ మేకింగ్ 2.0



ఒకప్పుడు పెళ్లిచూపులంటే.. అటేడు తరాలు, ఇటేడు తరాల గురించి పెద్దలు మాట్లాడుకున్నాకే మొదలయ్యేవి. తేనీటితో వచ్చే వధువుని నిమిషాల్లో చూసి నూరేళ్ల బంధానికి క్షణంలో ఓ నిర్ణయం చెప్పాల్సి ఉండేది. తరాలు మారాయి. ఏడు తరాల ముచ్చట్లు మూలపడ్డాయి. వెనుక ఉన్న ఆస్తులు, మీదఉన్న బాధ్యతలు ముందుకొచ్చాయి. ఒక్క ఫొటో అప్‌లోడ్ చేస్తే చాలు.. కంప్యూటర్ ఆల్గారిథమే ఓ తోడుని వెదికిపెట్టే మ్యాట్రిమోని సైట్లు ఎంట్రీ ఇచ్చాయి. నేటితరానికి ఈ సైట్లూ బోర్ కొట్టినట్టు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో అంతులేని స్క్రోలింగ్ కంటే.. ఆఫ్‌లైన్‌లో ఆత్మీయ సమావేశంలోనే తోడుని వెదుక్కుంటున్నాయి. ఇలాంటివారిలో కొత్త ఆశలు రేకెత్తించి.. తోడుకోసం దౌడు తీయిస్తున్న మ్యాచ్ మేకింగ్ ఈవెంట్స్ వచ్చేస్తున్నాయ్. దూరభారమని మ్యాట్రిమోనీలో సంబంధాలు వెదుక్కుంటే.. వేల ప్రొఫైల్స్, అంతులేని స్క్రోలింగ్, గంటల కొద్దీ చాటింగ్ సమయాన్ని తినేస్తోంది. అన్నీ కుదిరాక.. తీరా కలిశాక కొందరికి నిరాశే మిగులుతున్నది. స్క్రీన్ మీద కనిపించినట్టుగా మనుషులు ఉండరు. అప్‌లోడ్ చేసినట్లుగా ప్రొఫైల్ ఉండదు. మ్యాట్రిమోనీల్లో ఎంతోమందికి ఎదురయ్యే చేదు అనుభవమిది. అందుకే, టెక్నాలజీ అనేది పరిచయానికి వారధిగా ఉండాలి. అదే జీవితం కావొద్దు. ఆదర్శాలు, వివాదాలు లేకుండా పారదర్శకంగా పెళ్లి చూపులు ఉండాలని నేటితరం కోరుకుంటోంది. అందుకే పెళ్లిచూపులు మళ్లా ఆఫ్‌లైన్‌లోకి మారిపోతున్నాయ్. ఇటేడు తరాలు, అటేడు తరాలు కాకుండా.. ఇద్దరి ఆలోచనలు కలిస్తే చాలు కలిసి పయనిద్దామనే పెళ్లి ప్రమాణాలు పెట్టుకుంటోంది యువత. ఈ కొత్త ప్రమాణాలకు తగ్గట్టు 'పర్సనలైజ్డ్ మ్యాచ్ మేకింగ్' ఈవెంట్లు టెంట్లు వేసి పిలుస్తున్నాయ్. మ్యాచ్ మేకింగ్ యాప్స్‌లో వేల మందిని చూడటం కంటే.. తమ అభిరుచులకు తగ్గట్టుగా ఉ ఒడే నలుగురిని నేరుగా కలవడమే మేలనుకుంటున్న వాళ్లు ఈ ఈవెంట్లకు పోలోమంటూ వస్తున్నారు. 'స్పీడ్ డేటింగ్', 'సింగిల్స్ మిక్సర్', 'కర్యూటెడ్ డిన్నర్స్' పేరుతో మెట్రో నగరాల్లో పెళ్లి చూపులు చూడముచ్చటగా జరుగుతున్నాయ్.

ఏడడుగుల కోసం తొలి అడుగు: పెళ్లి పంట పండించడానికి కలవాల్సింది మనస్తత్వాలు కానీ, అల్గారిథమ్స్ కాదని భావించేవాళ్లు మనసుని అర్థం చేసుకోవడానికి ఆఫ్‌లైన్‌లోకి వస్తున్నారు. ప్రొఫైల్ సరిపోయినా.. పర్సనల్ ఇంట్రెస్ట్‌లు కూడా సరిపోవాలని కోరుకుంటున్నారు. ఒకటీ, రెండు సిట్టింగుల్లో మాటామాటా కలిపి తనేమిటో చెబుతూ, అవతలివాళ్లేమిటో తెలుసుకుంటున్నారు. ఇలాంటి మాటల ముచ్చట్లు కలపడానికే ప్రైవేట్ ఈవెంట్స్. మ్యాచ్ మేకింగ్ ఈవెంట్లలో కావాలనుకున్న వాళ్లను కలుపుకొనిపోతే సమయం సరదాగా గడిచిపోతుంది. విందు, వినోదాలతోపాటు అర్థం చేసుకోవాల్సిన మనుషితో సమయం గడిచిపోతుంది. ఇక్కడ 'వైబ్'ని చెక్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఒకరికొకరు అర్థమైతే ఏడడుగుల బంధానికి అక్కడే తొలి అడుగు పడుతుంది.

యంగ్ ఫీలింగ్స్!: ఆన్‌లైన్‌లో చూసేది కేవలం 'ప్రదర్శన' మాత్రమే. మనిషి హావభావాలు, మాటతీరు, నిజాయతీ ముఖాముఖిగా మాట్లాడుకున్నప్పుడే తెలుస్తాయి. 'స్క్రీన్ మీద వందసార్లు చూసే కంటే.. ఒక్కసారి కళ్లలోకి చూసి మాట్లాడటం మిన్న' అని యువత భావిస్తోంది. డేటింగ్ యాప్స్ బోర్ కొట్టిన వారు, తోడు కోసం సీరియస్‌గా వెతికేవారు మళ్లీ రియాలిటీ వైపు అడుగులు వేస్తున్నారు. ఇది ఎంతమేలంటే.. ఫేక్ ఐడీ భయం లేదు. పూర్తిగా వెరిఫై చేసిన వ్యక్తులను మాత్రమే ఈవెంట్‌కి అనుమతిస్తారు. కాబట్టి సందేహాలు లేకుండా సంబంధాన్ని కలుపుకోవచ్చు. ఈ సౌలభ్యం వల్లే యువత ఈ ట్రెండ్‌ని ఆదరిస్తోంది. ఈ కొత్త మార్పు వివాహ వ్యవస్థలో పారదర్శకతను, ఆత్మీయతను పెంపొందిస్తుందని ఆశిద్దాం!

# ప్రయాణాల్లో పడుకోవట్లేదా?!



వేసవి సెలవులు వచ్చాయంటే.. పల్లెలకు, టూర్లకు ప్లాన్ చేస్తుంటారు. నచ్చిన ప్రాంతాలకు ప్రయాణాలు కట్టేస్తుంటారు. అయితే, ట్రావెలింగ్‌ను పిల్లలు ఎంజాయ్ చేసినా.. నిద్ర పోవడంలో ఇబ్బంది పడుతుంటారు. పరిసరాల మార్పు, ప్రయాణపు షెడ్యూల్, ప్రయాణంలోని ఉత్సాహం.. ఇవన్నీ పిల్లల నిద్రకు అంతరాయం కలిగిస్తాయి. దాంతో, మరుసటి రోజు చిరాకుగా, అలసిపోయినట్లు కనిపిస్తారు. తగినంత నిద్ర లేకపోతే.. పిల్లలతోపాటు తల్లిదండ్రులకూ ఇబ్బందిగా ఉంటుంది. ఇలాంటి వారికి నిపుణులు కొన్ని సలహాలు అందిస్తున్నారు.

ప్రయాణాల్లో చాలామంది తల్లిదండ్రులు చేసే పొరపాటు.. పిల్లలకు స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ అప్పగించడం. దీనివల్ల ప్రయాణాల్లో వారి అల్లరి తగ్గుతుందని భావిస్తారు. కానీ, ఇది వారి నిద్రపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. స్క్రీన్‌టైమ్ పెరగడం వల్ల.. పిల్లలకు నిద్ర దూరమవుతుంది. కాబట్టి, పడుకోవడానికి కనీసం ఒక గంట ముందు.. స్క్రీన్ వాడకాన్ని నివారించాలి. పిల్లలు ఇంట్లో వాడే దుప్పటి, దిండు, వారికి ఇష్టమైన బొమ్మను వెంట తీసుకెళ్లండి. ఈ వస్తువుల వాసన, వాటి స్పర్శ.. పిల్లలకు సురక్షితమైన అనుభూతిని ఇస్తాయి. వారికి అలవాటైన వస్తువులు.. వారిని త్వరగా నిద్రపోయేలా చేస్తాయి. ప్రయాణాల్లో పిల్లలకు మెత్తని, కాటన్ దుస్తులు వేయండి. వాతావరణానికి తగిన దుస్తులను ఎంచుకుంటే.. వారికి అసౌకర్యం కలగకుండా ఉంటుంది. దాంతో పడక ఎక్కగానే.. చక్కగా కునుకు పట్టేస్తుంది. ఆకలిగా ఉంటే.. ఇంట్లోకూడా నిద్ర పట్టదు. కాబట్టి, ప్రయాణ సమయంలో వారికి తేలికపాటి ఆహారం అందించండి. పొట్ట నిండుగా ఉంటే.. త్వరగా నిద్ర పడుతుంది. లైట్లు ఎక్కువగా ఉంటే పిల్లలు నిద్రపోవడానికి ఇష్టపడరు. కాబట్టి, వీలైతే వారి కళ్లకు అడ్డుగా ఉండేలా చిన్న సన్‌షేడ్స్, మెత్తని వస్త్రాన్ని వాడండి. కారు ప్రయాణంలో వారు నిద్రపోయినప్పుడు సీటు బెల్ట్, క్యారియర్ కంఫర్ట్‌గా ఉండేలా చూసుకోండి. ఇంట్లో పడుకునేముందు పిల్లలు ప్రతిరోజూ చేసే పనులను.. ప్రయాణాల్లో కూడా కొనసాగించండి. ముఖం కడగడం, దుస్తులు మార్చడం, కథలు చెప్పడం, పాటలు పాడటం.. ఇవన్నీ ఇక నిద్రపోయే సమయం ఆసన్నమైందని వారి మెదడుకుసంకేతాన్ని పంపుతాయి. దాంతో, నిద్ర ముంచుకొచ్చేస్తుంది. సాధ్యమైనంత వరకు ప్రయాణాన్ని పిల్లల నిద్ర వేళలకు అనుగుణంగా ప్లాన్ చేసుకోండి. రాత్రి వేళల్లో ప్రయాణించడం వల్ల వారు సహజంగానే నిద్రపో వడానికి అవకాశం ఉంటుంది.

# తెలంగాణలో హెల్త్ ఏటీఎంలు

హైదరాబాద్, : తెలంగాణ ప్రజలకు రేవంత్ సర్కార్ శుభవార్త తెలిపింది. ఆరోగ్య సేవలను మెరుగపర్చేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక సదుపాయాలు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా టెక్నాలజీతో కూడుకున్న హెల్త్ ఏటీఎంలను తీసుకురావాలని యోచిస్తోంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా కొన్ని ఆస్పత్రుల్లో తీసుకురాగా.. ఇవి విజయవంతమయ్యాయి. దీంతో మరిన్ని ఆస్పత్రుల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఔట్ పేషెంట్లు ఎక్కువగా ఉండే హాస్పిటల్స్‌లో వీటిని నెలకొల్పనుంది. హెల్త్ ఏటీఎంలుగా పిలుస్తున్న ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్టింగ్ మెషీన్లను త్వరలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం కింగ్ కోఠి జిల్లా హాస్పిటల్, మలక్ పేట్ ఏరియా ఆస్పత్రుల్లో హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేసి పరీక్షించారు. ఇవి పూర్తిగా విజయవంతం అయ్యాయి. రోగ నిర్ధారణలో ఇవి ఖచ్చితత్వాన్ని చూపిస్తున్నాయి. ఈ హెల్త్ ఏటీఎంలలో పరీక్షలు చేయించుకున్న రోగుల నమూనాలను టీ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు పంపారు. ఇక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో కూడా పరీక్షలు నిర్వహించారు. హెల్త్ ఏటీఎంలలో వచ్చిన రిజల్ట్స్.. వీటిల్లోనే అలాగే వచ్చాయి. ఫలితాలు సరిపోవడంతో హెల్త్ ఏటీఎంల పనితీరు బాగుందనే అంచనా అధికారులు వచ్చారు. దీంతో మరిన్ని ప్రభుత్వ



దవాఖానాల్లో వీటిని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఇప్పటికే వీటిపై ప్రభుత్వానికి ఒక నివేదికను అధికారులు సమర్పించారు. రోగుల రద్దీ ఎక్కువగా ఉంటే హాస్పిటల్స్‌లో వీటిని ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సేవలు వేగంగా అందించవచ్చుఈ హెల్త్ ఏటీఎంలు కొన్ని నిమిషాల వ్యవధిలోనే 132 రకాల టెస్టులు ఆటోమేటిక్‌గా చేస్తాయి. డాక్టర్‌తో సంబంధం లేకుండా ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు అన్నీ పూర్తి చేస్తాయి. అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ వైద్య పరికాలతో పనిచేసే ఈ ఏటీఎంలు..రోగిబాడీని స్కాన్ చేసి బీపీ, రక్తంలో ఆక్సిజన్ స్థాయి. బరువు, ఎత్తు, బాడీ టెంపరేచర్ వంటి వాటిని వేగంగా కొలుస్తాయి. ఇక డెంగ్యూ, మలేరియా. యూరిన్, కొలెస్ట్రాల్, ఈసీజీ, షుగర్, హెచ్‌ఐడీ వంటి ర్యాపిడ్ టెస్టులు వేగంగా చేస్తాయి. ఇక రోగి డిజిటల్ హెల్త్ రికార్డ్ తయారుచేసి భద్రపరుస్తుంది. ఇక టెస్టులు పూర్తయిన తర్వాత దీని ద్వారానే డాక్టర్‌తో మాట్లాడుకోవచ్చు. ఓ ప్రైవేట్ సంస్థ ఈ యంత్రాలను అభివృద్ధి చేయగా.. రెండు నెలల పాటు పరీక్షించారు. వీటి వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేగంగా రోగులకు సేవలు అందుతున్నాయి. డాక్టర్ల కోసం వెయిట్ చేసే పని తప్పుతుంది. ఇలా వీటి వల్ల అనేక లాభాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# సర్వేలతో టెన్షన్.. టెన్షన్..

న్యూఢిల్లీ, : ఏప్రిల్, మే నెలలో నాలుగు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలపై దేశమంతా ఆసక్తిగా ఫోకస్ చేసింది. ఎవరు అధికారంలోకి వస్తున్నారు, ఎవరి ప్రభావం ఎంత అనే డిస్కషన్ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే ఆయా రాష్ట్రాల్లో ప్రజల అభిప్రాయాలు క్రమంగా వెలువడుతున్నాయి. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మమతా బెనర్జీ కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతున్నారు. ఆమెను ఎలాగైనా అధికారంలో నుంచి దించి కాషాయపు జెండా ఎగరేయాలని బీజేపీ ప్రతి వ్యూహాలతో ప్రయత్నాలు చేస్తోంది. కేరళలో యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ హోరాహోరీగా పోటీపడుతున్నాయి. అస్సాంలో కాంగ్రెస్ బీజేపీ ఢీ కొంటున్నాయి. అన్నింటి కంటే ఎక్కువ ఆసక్తిని కలిగించే ఎన్నికల తమిళనాడు అసెంబ్లీ పోరు. 292 సీట్లు ఉన్న పశ్చిమబెంగాల్‌లో మాట్రిజ్ ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ పోటీ అంచనాలు అందనంతగా ఉంది. తాజా సర్వేలో పార్టీలే షేక్ అయ్యే అభిప్రాయాలు ప్రజలు చెప్పారు. ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ 43 శాతం ఓట్లతో 140 నుంచి 160 సీట్లను గెలుచుకోగలదు. ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ 41 శాతం ఓట్లతో 130 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. రాష్ట్రంలోని ఇతర పార్టీలు 16 శాతం ఓట్లతో 8 నుంచి 16 సీట్లు గెలుచుకోగలవు. పశ్చిమ బెంగాల్‌లో 148 సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారంలోకి వస్తుంది. ఈ అభిప్రాయ సేకరణలో టీఎంసీకి 2 శాతం స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ ఈ తేడా చాలా తక్కువగా ఉ ఒడటంతో ఎన్నికల చిత్రం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు. మాట్రిజ్, చాణక్య నిర్వహించి ఒక సర్వే ప్రకారం అసోంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పటిష్టమైన స్థితిలో ఉంటుంది. తిరిగి అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. మ్యాట్రిక్స్ ప్రకారం బీజేపీ కూటమి 46 శాతం ఓట్లు వస్తే, కాంగ్రెస్ కూటమికి 36 శాతం ఓట్లు వస్తాయి. ఇతరులు 18 శాతం ఓట్లు వస్తాయి. 126 అసెంబ్లీ సీట్లు ఉన్న అస్సాంలో బీజేపీ కూటమికి 92 నుంచి 102 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 22 నుంచి 32 సీట్లు, ఇతరులకు 4 నుంచి 7 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. చాణక్య సర్వే ప్రకారం అస్సాంలో బీజేపీ 83 నుంచి 90 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 30 నుంచి 36 సీట్లు, ఇతరులు నాలుగు నుంచి ఏడు సీట్లలో గెలుచుకోగలరని చెబుతోంది. ఇండియా టీవీ ప్రసారమైన మ్యాట్రిజ్ అభిప్రాయం ప్రకారం, ఈసారి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలల్లో అన్నా డీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ భారీ విజయం సాధించే అవకాశం ఉంది. ఈ అభిప్రాయ సేకరణ ప్రకారం, స్టాలిన్ పార్టీ అయిన డీఎంకే ఎన్నికల్లో 102 నుంచి 115 సీట్లు గెలుచుకోగలదు. బీజేపీ, ఏఐడీఎంకే కలిసి ఉన్న ఎన్డీఏ కూటమి 107 నుంచి 120 సీట్లు గెలుచుకుంటుందని అంచనా. విజయ్ అధ్యక్షత వహించిన టీవీకే ఐదు నుంచి 12 సీట్లు మాత్రమే గెలుచుకోగలదు. ఇతరులు 1 నుంచి ఆరు సీట్లు గెలుచుకుంటారని అంచనాలు చెబుతున్నాయి. ఇండియా టీవీలో ప్రసారమైన మ్యాట్రిజ్ అభిప్రాయ సేకరణ ప్రకారం, కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష కూటమి 62 నుంచి 68 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేయగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 67 నుంచి 73 సీట్లు గెలుచుకుంటుందని సర్వే చెబుతోంది. 15 శాతం ఓట్లతో ఉన్న బీజేపీ 5 నుంచి 8 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇతరులు మూడు సీట్లలో విజయం సాధిస్తారని భావిస్తున్నారు.

## చిట్టీల పేరుతో మోసం...
## రూ.80 లక్షల టోకరా..!

మహబూబాబాద్ ప్రతినిధి: చిట్టీల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసిన ఘటన మహబూబాబాద్ పట్టణంలో వెలుగులోకి వచ్చింది. ఓం శ్రీమన్నారయణ చిట్ ఫండ్ పేరుతో సభ్యుల నుండి భారీగా డబ్బులు సేకరించి, తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిట్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ అజ్మీర మంగిలాల్, అతని భార్య సావిత్రి కలిసి సభ్యుల వద్ద నుంచి సుమారు రూ.80 లక్షలు వసూలు చేశారనీ అయితే, గడువు పూర్తైనప్పటికీ బాధితులకు డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో బాధితులు పోలీసులను ఆశ్రయించగా, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. ఇలాంటి చిట్ ఫండ్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంస్థలలో డబ్బులు పెట్టుబడి పెట్టే ముందు పూర్తిగా వివరాలు తెలుసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

## ఇరాన్ నుంచి సురక్షితంగా వీడండి
### భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ

న్యూఢిల్లీ, ఏప్రిల్8 :ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్–అమెరికా (ఎసజీని–జాం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మిషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.

# రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు !

రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఎపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచిదే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగునీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ తెలంగాణ అడుక్తికునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబాటుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీయాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుపడాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండడానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధానులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసినందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆర్ఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్ప, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ఢంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయాలి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కోవాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితంగా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకుపోవడం ఖాయం. నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్సరం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధజకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి మీద ద్వేషంతో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరాలతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యామా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు...ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరావతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచితంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించలేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్ధిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.

# సినిమా

## ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ



'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎలాన్ చేస్తున్నారట. ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

### రణ్‌బీర్ 'రామాయణం' వీఎఫెక్స్‌పై ట్రోలింగ్..

## మౌనం వీడిన నిర్మాత



బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమా వీఎఫెక్స్‌పై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలు, ట్రోలింగ్స్ పై నిర్మాత నమిత్ మల్హోత్రా స్పందించారు. ప్రేక్షకుల నుంచి వస్తున్న అభిప్రాయాలను గౌరవిస్తున్నామని, కచ్చితంగా మెరుగైన అవుట్‌పుట్ తో ముందుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "కొన్ని రోజులుగా వస్తున్న స్పందన మమ్మల్ని మరింత ఉత్తేజపరిచింది. ప్రపంచవ్యాప్తం గా కోట్లాది మంది హృదయాల్లో నిలిచిన రాముడి కథ ఇది. అందరి అభిప్రాయాలను, సూచనలను మేము స్వీకరిస్తున్నాం. వేలాది మంది కళాకారులు ఈ సినిమా కోసం ఎంతో అంకితభావంతో పనిచేస్తు న్నారు. అందరి అంచనాలకు తగ్గట్టుగా, ఉన్నత ప్రమాణాలతో సినిమా ను అందిస్తాం" అని నమిత్ తన నోట్‌లో పేర్కొన్నారు. ఇటీవల 'రామాయణం' నుంచి రాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌కు సంబంధించిన కొన్ని విజువల్స్ బయటకు వచ్చాయి. అయితే, అందులోని వీఎఫెక్స్ నాణ్యత చాలా పేలవంగా ఉందని నెటిజన్లు తీవ్రంగా విమర్శించారు. ఏఐ టూల్స్ ఉపయోగించి గ్రాఫిక్స్ చేశారని, బడ్జెట్ లెక్కలు తప్పు చూపిస్తున్నారని ట్రోల్ చేశారు. ఈ నేపథ్యంలో నిర్మాత స్పందించారు. కాగా, ఈ సినిమా వీఎఫెక్స్ బాధ్యతలను నమిత్ మల్హోత్రాకు చెందిన ఆస్కార్ విన్నింగ్ సంస్థ డీఎన్‌ఈజీ (DNEG) చూడటం గమనార్హం. నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఏ.ఆర్.రెహమాన్‌తో పాటు ఆస్కార్ విజేత హన్స్ జిమ్మెర్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## అనేక గందరగోళాల మధ్య అఖిల్ లెనిన్ రిలీజ్ డేట్ ఫిక్స్..






టాలీవుడ్‌లో భారీ చిత్రాల విడుదల తేదీలు వరుసగా మారుతూ ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒక సినిమా వాయిదా పడితే మరో సినిమాపై ప్రభావం చూపుతూ ఇది చైన్ రియాక్షన్‌లా మారుతోంది. రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రం మళ్లీ వాయిదా పడే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మొదట ఈ చిత్రాన్ని మార్చి 27న విడుదల చేయాలని భావించిన చిత్రబృందం, షూటింగ్ ఆలస్యం కారణంగా ఏప్రిల్ 30కి మార్చింది. అయితే ఇప్పుడు ఆ తేదీ కూడా సాధ్యం కాదనే అభిప్రాయం ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తోంది. 'పెద్ది' విడుదల తేదీపై స్పష్టత లేకపోవడం ఇతర సినిమాలపై కూడా ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా అఖిల్ నటిస్తున్న 'లెనిన్' చిత్రం ఎక్కువగా ప్రభావితమైంది. మొదట 'పెద్ది' ఏప్రిల్ 30న విడుదల అవుతుందనే కారణంతో 'లెనిన్'ను వాయిదా వేశారు. అయితే పెద్ది మళ్లీ వాయిదా పడ్డా కూడా లెనిన్ ఆ డేట్‌కి వచ్చే పరిస్థితి లేదు. ఈ రోజు అఖిల్ బర్త్ డే సందర్భంగా మూవీ నుండి పోస్టర్ విడుదల చేస్తూ జూన్ 26న లెనిన్ రిలీజ్ కానుందంటూ ప్రకటించారు. దీంతో అక్కినేని అభిమానులు ఆ రోజు కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ రోజు లెనిన్ నుండి ఏదైన టీజర్ వస్తుందేమోనని ఫ్యాన్స్ ఎంతో ఆశగా ఎదురు చూడగా, వారికి నిరాశే ఎదురైంది. లెనిన్ మూవీకి 'వినరో భాగ్యము విష్ణు కథ' ఫేం మురళీ కృష్ణ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నాడు. అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్, సాంగ్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. శివాజీ కీలకపాత్రలో నటిస్తున్నారు. తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పీ, సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. అఖిల్ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన అఖిల్ ఆ తర్వాత వచ్చిన హలోతో అంతగా అలరించలేకపోయాడు. ఇక ఆ తర్వాత మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్, మిస్టర్ మజ్ను, లాస్ట్‌గా ఏజెంట్ మూవీలో నటించారు. ఇప్పటివరకూ సరైన హిట్ పడలేదు.

## 'పంజా' నుంచే శేష్ ను గమనిస్తున్నా



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం 'డెకాయిట్'. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విక్టరీ వెంకటేశ్, చిత్ర బృందంపై ప్రశంసలు కురిపిస్తూ సినిమా విజయంపై ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ, అడివి శేష్‌ను తాను 'పంజా' సినిమా సమయం నుంచే గమనిస్తున్నానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"పంజాలో శేష్‌ను చూసినప్పుడే అతను భవిష్యత్తులో మంచి నటుడు అవుతాడని నాకు అనిపించింది. ప్రతి సినిమాతో తనను తాను నిరూపించుకుంటూ ఎదుగుతున్నందుకు సంతోషంగా ఉంది" అని వెంకటేశ్ అన్నారు. 'డెకాయిట్' కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందని ఆయన జోస్యం చెప్పారు. హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి మాట్లాడుతూ, ఆమె ముఖంలో అద్భుతమైన హావభావాలు పండుతాయని, ఆమె నటన ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని కొనియాడారు. ఎంతో ప్యాషన్‌తో, క్రమశిక్షణతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత సుప్రియ యార్లగడ్డను వెంకటేశ్ ప్రత్యేకంగా అభినందించారు. తాను ఈ వేడుకకు సుప్రియతో పాటు తనకు ఇష్టమైన సురేంద్ర మామయ్య కోసం వచ్చానని చెప్పడం అందరినీ ఆకట్టుకుంది.

## లిటిల్ హార్ట్స్ దర్శకుడు బిగ్ అనౌన్స్‌మెంట్.. అడివి శేష్‌తో లవ్ స్టోరీ



చిన్న బడ్జెట్ సినిమాతో భారీ విజయాన్ని అందుకుని టాలీవుడ్ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు సాయి మార్తాండ్ ఇప్పుడు తన తదుపరి ప్రాజెక్ట్‌తో మరోసారి హాట్ టాపిక్‌గా మారాడు. సాయి మార్తాండ్ తెరకెక్కించిన లిటిల్ హార్ట్స్ సినిమా కేవలం రెండు కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద దాదాపు 30 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. ఈ విజయంతో సాయి మార్తాండ్ పేరు ఒక్కసారిగా టాలీవుడ్‌లో మార్మోగిపోయింది. తాజాగా తన తదుపరి చిత్రంపై సాయి మార్తాండ్ క్లారిటీ ఇచ్చాడు. అడివి శేష్ నటిస్తున్న డెకాయిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడిన ఆయన కీలక ప్రకటన చేశాడు. నా నెక్స్ట్ సినిమా అడివి శేష్ గారితోనే ఉంటుంది. గూఢచారి 2 పూర్తయ్యాక మా సినిమా స్టార్ట్ అవుతుంది. ఇది ఒక లవ్ స్టోరీ" అని వెల్లడించాడు. ఈ ప్రాజెక్ట్‌లో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే... ప్రముఖ నటులు జగపతి బాబు,సునీల్ ఈ సినిమాతో నిర్మాతలుగా మారుతున్నారు. ఇద్దరూ కలిసి ప్రొడ్యూసర్లుగా వ్యవహరించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇది వరకూ విలన్, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా రాణించిన ఈ ఇద్దరు నటులు ఇప్పుడు నిర్మాణ రంగంలో అడుగుపెట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా థ్రిల్లర్, సస్పెన్స్ కథలతో ప్రేక్షకులను అలరించే అడివి శేష్... కామెడీ, ఫీల్ గుడ్ కథలను చెప్పే సాయి మార్తాండ్‌తో కలిసి లవ్ స్టోరీ చేయడం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ కొత్త కాంబినేషన్ ఎలా వర్కౌట్ అవుతుందో అన్నదానిపై సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కథ, ప్రెజెంటేషన్ ఎలా ఉంటాయో చూడాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. గతంలో 'లిటిల్ హార్ట్స్' సినిమా సమయంలోనే సాయి మార్తాండ్ తన నెక్స్ట్ సినిమా నిర్మాతగా జగపతి బాబు ఉంటారని చెప్పాడు. ఇప్పుడు అదే మాటను నిలబెట్టుకోవడం విశేషంగా మారింది. ఒక చిన్న సినిమాతో పెద్ద హిట్ కొట్టిన సాయి మార్తాండ్... ఇప్పుడు స్టార్ హీరో, క్రేజీ నిర్మాతలతో కలిసి మరింత పెద్ద స్థాయిలో తన సత్తా చూపించడానికి సిద్ధమవుతున్నాడు. ఈ స్పెషల్ కాంబినేషన్ టాలీవుడ్‌లో ఎలా సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

## అధిక శబ్దం కలిగించే 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్స్ ధ్వంసం



నల్లగొండ : అధిక శబ్దం కలిగించే ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్లను పోలీసులు ధ్వంసం చేశారు. బుధవారం నల్లగొండ పట్టణంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల అమలు , శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం నియంత్రణలో భాగంగా పర్యావరణ రక్షణకుప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ ఎస్పీ రమేష్ తెలిపారు. గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, ద్విచక్ర వాహన దారులు మాడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగించి అధిక శబ్దాలతో సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వివరించారు. ఇందులో భాగంగా సుమారు 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి వాటిని తొలగించి, పట్టణంలోని క్లాక్ టవర్ కూడలి వద్ద రోడ్ రోలర్ సహాయంతో ధ్వంసం చేశామన్నారు. సైలెన్సర్లలో అనుమతి లేకుండా మార్పులు చేసి అధిక శబ్దం కలిగించే విధంగా ఉపయోగిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తిరిగి మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తే వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవ రావు, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య,వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ ఎస్సై సైదులు,రూరల్ ఎస్సై సైదా బాబు, కనగల్ ఎస్సై రాజీవ్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధం ఇరాన్, ఇజ్రాయెల్‌ది..

# లాభం మాత్రం ఒమన్‌ది..!



ఢిల్లీ,: ఇరాన్, అమెరికా దేశాల మధ్య ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది. రెండు దేశాలు రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ ఒప్పందంలో అందరినీ ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే.. ఈ ఘర్షణతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధంలేని ఒమన్ దేశం ఆర్థికంగా భారీగా లాభపడబోతున్నది. హర్మూజ్ జలసంధి ని తిరిగి తెరిచేందుకు కుదిరిన ఒప్పందంలోని ఓ నిబంధన ఒమన్‌కు కాసుల వర్షం కురిపించనుంది. హర్మూజ్ జలసంధికి ఒకవైపు ఇరాన్ ఉండగా.. మరోవైపు ఒమన్ భూభాగమైన ముసందమ్ ద్వీపకల్పం ఉంది. తాజా ఒప్పందం ప్రకారం.. ఈ జలసంధి గుండా ప్రయాణించే ప్రతి నౌక నుంచి ఇరాన్‌తోపాటు ఒమన్ కూడా రవాణా రుసుము వసూలు చేస్తుంది. ఒక్కో నౌకపై సుమారు 2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 16.7 కోట్లు) వరకు వసూలు చేయనుండగా.. ఇందులో ఒమన్‌కు కూడా మంచి వాటా లభించనుంది. దాంతో ఒమన్ ఖజానాకు రోజూ వందల కోట్ల ఆదాయం వచ్చి చేరనుంది. అమెరికా, ఇరాన్ మధ్య దశాబ్దాలుగా నెలకొన్న వివాదాల్లో ఒమన్ తరచూ మధ్యవర్తిగా వ్యవహరిస్తూ వస్తున్నది. శాంతి చర్చల్లో కీలకపాత్ర పోషించినందుకు ప్రతిఫలంగానే ఇప్పుడు ఈ ఆర్థిక ప్రయోజనాన్ని పొందుతోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఒప్పందంతో మధ్యప్రాచ్యంలో ఒమన్ వ్యూహాత్మక ప్రాధాన్యం మరోసారి రుజువైంది. అయితే ఈ టోల్ ఫీజు ఏర్పాటుపై కొన్ని దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇరాన్, ఒమన్‌లు లాభపడినప్పటికీ ఈ అదనపు రుసుము భారం చివరికి ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులపైనే పడుతుందని విమర్శిస్తున్నాయి. మొత్తం మీద ఈ కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్‌కు దాడుల నుంచి ఉపశమనాన్ని, అమెరికాకు చమురు రవాణాకు హామీని ఇచ్చింది. అయితే ఎలాంటి ఘర్షణలోనూ పాలుపంచుకోని ఒమన్‌కు మాత్రం ఊహించని రీతిలో భారీ ఆర్థిక లాభాన్ని తెచ్చిపెట్టింది. అందుకే అంతర్జాతీయ మీడియా దీనిని 'ఒమన్ సైజ్ గెయిన్' గా అభివర్ణిస్తోంది.

# మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

## దాదాపు నాలుగు వేల వరకు పెరిగిన తులం ధర



హైదరాబాద్, ఏప్రిల్8 : యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక పడడంతో పసిడి ప్రియులకు షాక్ ఇచ్చే విధంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. మంగళవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,49,840 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,37,350 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,12,380 దగ్గర ట్రేడ్ అయింది. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం బుధవారం 24 క్యారెట్లపై 3,980 రూపాయలు.. 22 క్యారెట్లపై 3,650 రూపాయలు.. 18 క్యారెట్లపై 2,990 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం పది గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,53,820 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,41,000 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,15,370 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఈ రోజు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కేజీ వెండిపై పది వేలు పెరిగి 2,65,000 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల వెండిపై వెయ్యి పెరిగి 26,500 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

# యువతలో స్కిల్స్ పెంచేందుకు ప్రణాళికలు రూపొందించండి

**కలెక్టర్ చిత్రా మిశ్రా**

**ప్రైవేటు పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం**



కరీంనగర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లాలోని పరిశ్రమలు, ఆసుపత్రులు తదితర సేవా రంగ సంస్థల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫ రెన్స్ హాలులో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు,ఫ్యూ చర్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ రుచి గుప్తాతో ఏర్పా టు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉద్యోగాల కోసం అవసరమైన స్కిల్స్ యువత పెంచుకునేలా చూడాలన్నారు.తమ పరిశ్రమ లు,కంపెనీల్లో పనిచేసేందుకు అవసరమైన స్కిల్స్ కల్గిన అభ్యర్థుల కోసం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిని సంప్రదించాలని ప్రైవేటు పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు.నైపుణ్యాలు పెంపొందించే ఐటిఐ,ఇతర ప్రభుత్వ కార్యక్ర మాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొనేలా చూడాలన్నారు.స్కిల్ అప్ గ్రేడ్,స్కిల్ డెవలప్మెంట్ గురించి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.స్థానిక యువత లో స్కిల్స్ పెంచి ఉద్యోగాలు సాధించేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,జిల్లా ఉపాధి కల్పన శాఖ జాయింట్ డైరెక్టర్ రేఖా రాణి,డిప్యూటీ డైరెక్టర్ రమేష్ బాబు,ఉపాధి కల్పన శాఖ వరంగల్ రీజినల్ ఆఫీసర్ రవీందర్,జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి తిరుపతిరావు,మెప్మా పీడీ స్వరూప రాణి,పరిశ్రమల శాఖ జిఎం సాల్మన్ రాజ్,వివిధ శాఖల అధికారులు,టాటా, ఆదర్శ,వరుణ్ మోటార్స్, అపోలో,కరీంనగర్ డెయిరీ, రైస్ మిల్,గ్రానైట్ అసోసి యేషన్ ప్రతినిధులు, మలబార్ గోల్డ్ కరీంనగర్ శాఖ ప్రతి నిధులు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు




జగిత్యాల: జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను జిల్లా జడ్జి రత్న పద్మావతి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. శనివారం నాడు నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో మొత్తం 3034 కేసులు పరిష్కారం కావడం జరిగింది. ఈ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఈ రోజు జిల్లా కోర్టు ప్రాంగణంలో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి రత్న పద్మావతి మాట్లాడుతూ, పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి కేసుల్లో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి "రాజీ మార్గమే రాజమార్గం" అని అవగాహన కల్పించినందువల్లే ఈ స్థాయిలో కేసులు పరిష్కారం కావడం సాధ్యమైందన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఇరు వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు.గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ స్థాయిలో కేసులు పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ, రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ , అదనపు జిల్లా జడ్జి నారాయణ, లీగల్ సెల్ సెక్రటరీ వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ, మేజిస్ట్రేట్ లు లావణ్య,నికిషా, డిఎస్పి రఘు చందర్, బార్ కౌన్సిల్ జగిత్యాల అధ్యక్షులు, అలాగే జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు కాళేశ్వరం కమిషన్ పై హైకోర్టులో తీర్పు

కాళేశ్వరం: మంథని శాసన సభ నియోజకవర్గ పరిధిలోని కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్, కమిషన్ నివేదికను సవాలు చేస్తూ మాజీ సీఎం కే చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీష్ రావు, ఐ ఏ ఎస్ స్మిత సబర్వాల్ పిటిషన్లు దాఖలు చేశారు. దాఖలు చేసిన పిటిషన్ లో అన్ని పక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు కొద్ది రోజులు తీర్పును రిజర్వు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని రేవంత్ రెడ్డి, ప్రభుత్వం నియమించిన జస్టిస్ సిపి ఘోష్, కమిషన్ నివేదిక అంశంపై మంగళవారం హైకోర్టు తుది తీర్పు వెల్లడించనుంది. లిఖిత పూర్వక వాదనలు సమర్పించడానికి ఒకటి, రెండు రోజులు అవకాశం ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు మంగళవారం తెలంగాణ హైకోర్టు తీర్పు వెల్లడించనున్న నేపథ్యంలో రాజకీ యవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## వైద్యులకు ఐసియూ త్వరితగతిన..

# అందుబాటులోకి తేవాలి

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందాలి**

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**





నిర్మల్ (తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలోని అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, పట్టణంలోని జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం చివరిదశలో ఉన్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఆసుపత్రి భవంతి నిర్మాణానికి సంబంధించి మ్యాపులను సంబంధిత అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వివరాలు, ఇంకా చేపట్టవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వివిధ విభాగాలను పరిశీలించారు. శస్త్ర చికిత్సల గదులు, డయాలసిస్ కేంద్రం, ఐ.సి.యు, గైనిక్ విభాగం, ఎలక్ట్రికల్ యూనిట్, ఫైర్ సేఫ్టీ విభాగాలు పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవల నిమిత్తం అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం సమీపంలోని యుడిఐడి (సదరం) కేంద్రం, డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ లు పరిశీలించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల విభాగం, రక్త పరీక్షల గది, తదితర విభాగాలు పరిశీలించారు. అన్ని రకాల రిజిస్టర్లను చూశారు. బ్లడ్ బ్యాంక్ ను తనిఖీ చేసి, రికార్డు పరిశీలించారు. రికార్డుల్లో ఇంతకుముందు బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం పొందిన వారికి ఫోన్ చేసి, వివరాలు సరిపోల్చారు. రికార్డులు, రసీదులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ తనిఖీలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో గల బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆసుపత్రిలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స కొరకు రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, స్థానిక కౌన్సిలర్ తౌహిదుద్దిన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా ముగిసిన

# దిశా సర్వసభ్య సమావేశం

**- అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష**
**ఎంపి రామ సహాయం రఘు రామ్ రెడ్డి**
**- తాగునీరు, వైద్యం, మౌలిక వసతులపై**
**ప్రత్యేక దృష్టి :పోరిక బలరాం నాయక్**







భద్రాద్రి బ్యూరో (ఏప్రిల్ 08): భద్రాద్రి జిల్లాలో దిశా సర్వసభ్య సమావేశం బుధవారం జిల్లా కేంద్ర ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎంపీ రామ సహాయం రఘు రామ్ రెడ్డి అధ్యక్షత వహించారు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కో–చైర్మన్‌గా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, దిశా కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సమావేశంలో గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతి సమగ్రంగా సమీక్షించబడింది. ఎంపీ రామ సహాయం రఘు రామ్ రెడ్డి జిల్లా అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పనుల పురోగతిని నివేదికల రూపంలో ఎప్పటికప్పుడు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, గత నిర్ణయాలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టంగా సూచించారు. ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తుందని, ఇప్పుడు కేవలం 60 శాతం మాత్రమే ఇచ్చే విధంగా మార్పు వచ్చి, మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. అదేవిధంగా గృహ నిర్మాణ శాఖలో అనేక మార్పులు రావడం వలన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర చర్చ జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమని, ప్రతి పథకం లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులకు సమయానికి ప్రయోజనాలు చేరేలా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. మణుగూరు, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల పరిశుభ్రత, ఆహార నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ, అంబులెన్స్, డయాలసిస్ సేవల విస్తరణ, సికిల్ సెల్ అనీమియా, హెచ్పీవీ వ్యాక్సిన్ అవగాహన కార్యక్రమాలపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ, అమృత్ పథకాల కింద తాగునీటి సరఫరా, పైప్‌లైన్ లీకేజీలను తొలగించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలలో త్రాగునీటి సరఫరా పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఐటీడీఎ నిధులతో చేపట్టిన పనులలో ఆలస్యానికి కారణాలను వివరించాలని అధికారులు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, మారుమూల ప్రాంతాల వరకు త్రాగునీటి సరఫరా కల్పించాలని, ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయడం కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రాధాన్యతగా తీసుకుని వాటి అమలును వేగవంతం చేయాలని, ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని, పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. శాసన సభ్యులు తమ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై అధికారులు సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు తమ నియోజకవర్గాల్లో పథకాల అమలు స్థితిగతులపై అధికారుల నుంచి సవివర నివేదికలు కోరారు. ఈ సమావేశంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, అశ్వరావుపేట మున్సిపల్ చైర్ పర్సన్ శశికళ, డి ఆర్ డి ఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, కొత్తగూడెం ఆర్డీవో మధు, దిశా కమిటీ సభ్యులు బుర్ర సురేష్, యేసుమని, స్వర్ణ జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com